విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 21, జూలై 2025

సూపర్ సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలి

- హెచ్ ఎల్‌సి కాలువ ద్వారా ప్రత్యేక నీరందించాలి
- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పాల్యం నారాయణ స్వామి

విశాలాంధ్ర-శింగనమల: సిపిఐ పుట్లూరు 4వ మండల మహాసభ మండల కార్యదర్శి పెద్దయ్య అధ్యక్షత వహించారు. ఈ మహాసభలకు. ముఖ్య అతిథులుగా. జిల్లా సహాయ కార్యదర్శి, పాల్యం, నారాయణస్వామి, నియోజకవర్గ కార్యదర్శి, టి.నారాయణస్వామి, హాజరైనారు. మండల కేంద్రంలో ర్యాలీ అనంతరం మోడల్ స్కూల్ సర్కిల్‌లో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్యం నారాయణస్వామి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఏపీలోని కూటమి ప్రభుత్వం సపోర్ట్ తో కేంద్ర ప్రభుత్వం నడుస్తున్నదని, ముఖ్యమంత్రి కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి పోలవరం ప్రాజెక్టు తొందరగా పూర్తి చేసి నీటి సమస్య పరిష్కరించాలన్నారు. మన రాష్ట్రానికి రావలసిన హక్కులను పరిష్కార దిశగా కేంద్రపై ఒత్తిడి తేవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం కోసం అనేక మోసపూరిత సూపర్ సిక్స్ వాగ్దానాలిచ్చి సంవత్సరాలు దాడుతున్న పూర్తిగా అమలు చేయకపోవడం ఎంతవరకు సమంజసమని, మహిళలకు ఉచిత బస్సు రాష్ట్రంలో ఎక్కడైనా తిరగచ్చని, ఇప్పుడు జిల్లాలకే పరిమితం అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆంక్షలతో కూడుకున్నదని ఆ వాగ్దానాన్ని వచ్చేనెల 15వ తేదీన 13 నెలల తర్వాత పల్లె వెలుగు బస్సుల్లో మాత్రమే అమలు చేస్తారనడం కరెక్ట్ కాదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తానని చెప్పి ట్రూ అప్, సర్దుబాటు, చార్జీల పేరుతో 15,485 కోట్ల రూపాయలు ప్రజలపై భారం మోపుతున్నారన్నారు.

తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, లోకేష్ బాబు గతంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని.. రైతులకు పిలుపునివ్వడం జరిగిందని, అధికారం వచ్చిన తర్వాత అదే స్మార్ట్ మీటర్లు దుకాణాలకు బిగిస్తున్నారన్నారు. ప్రజలంతా తిరగబడి స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని కోరారు. ఉమ్మడి ప్రభుత్వ పరిపాలనను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని సమయం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారన్నారు. నియోజవర్గ కార్యదర్శి టి.నారాయణస్వామి మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గంలోని హెచ్ఎల్‌సి కాల్వ ద్వారా ప్రతి ఎకరాకు నీళ్లు అందించి రైతులను ఆదుకోవాలని అన్నారు. గత ఏడాదిలో ప్రకృతి విపత్తు వల్ల అరటిపంట పూర్తిగా నష్టపోయారని.. ఈ ప్రభుత్వం ఆ రైతులను ఆదుకోపోవడంలో పూర్తిగా వైఫలం అయ్యిందన్నారు. ఏ ఒక్క వాగ్దానాన్ని సక్రమంగా అమలు చేయకపోగా ఇప్పుడు సుపరిపాలన మొదటి అడుగు అని మన ఎమ్మెల్యే మన ఇంటింటికి కార్యక్రమం ద్వారా ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నారని, ఎక్కడ ఇచ్చిన వాగ్దానాలు అమలు చేశారో ఎమ్మెల్యే చెప్పాలని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం దున్నపోతు మీద వాన కురిసిన చందంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. అనంతరం సిపిఐ పుట్లూరు నూతన మండల కమిటీ 13 మందితో ఎంపిక చేసి నాలుగో సారి మండల కార్యదర్శిగా, డి.,పెద్దయ్య, మండల సహాయ కార్యదర్శులుగా, సి.పెద్దిరాజు, బాలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బుక్కరాయ సముద్రం మండల కార్యదర్శి, మద్రిస్వామి, సహాయ కార్య దర్శులు, శ్రీనివాసరావు, చిన్న తిరుపతయ్య, ఈశ్వరయ్య, ఓబుల్‌పతి, శాంతకుమారి, రమేష్, పెద్దన్న, వెంకట శివ, దావీద్, దేవరాజు, నడిపి నారాయణ, బలరాముడు, నారాయణ, బాల ఓబులేసు, కే.లక్ష్మీనారాయణ, వెంకటేష్, ఆదినారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వమిచ్చిన హామీల అమలుకు పోరాటాలు చేయాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: గ్రామాల్లో సిపిఐ పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని సిపిఐ పార్టీ ఉరవకొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జె.మల్లికార్జున కోరారు. సిపిఐ పార్టీ విడపనకల్లు 12వ మండల మహాసభ పార్టీ సీనియర్ నాయకులు చెన్నారాయుడు అధ్యక్షతన ఆదివారం విడపనకల్లు మండల కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మల్లికార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో పాలకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని.. సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేయాలని ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకాన్ని కలిగించాలన్నారు. సిపిఐ పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతుందని, సమ సమాజ స్థాపనే లక్ష్యంగా దోపిడీ లేని సమాజం కోసం అంతరాలు లేని వ్యవస్థ కోసం పోరాడుతున్న దేశంలోనే మొట్టమొదటి రాజకీయ పార్టీ సిపిఐ అని తెలిపారు. నాటి నుండి నేటి వరకు కార్మిక, కర్షకుల సమస్యలతో పాటు దేశంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడు తున్నదని పేర్కొన్నారు. దేశాన్ని పాలిస్తున్న నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పక్కన పెట్టి, ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి కేవలం కార్పొరేట్ బహుళజాతి సంస్థలకు సంపన్న వర్గాలకు అనుకూల నిర్ణయాలు చేస్తూ దేశ సంపదను కొల్లు కొడుతున్నాడని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీలను అమలు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. అర్హులందరికీ ఇండ్లు, రేషన్ కార్డులు, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన, రైతు భరోసా సూపర్ సిక్స్ తదితర హామీలను వెంటనే నేరవేర్చాలని లేకుంటే ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

మండల కార్యవర్గం ఏర్పాటు : విడపనకల్లు మండల కార్యదర్శిగా రసూల్ వలి, సహాయ కార్యదర్శిగా వద్దే హనుమంతు, జెడ్పి ప్రహల్లాద, కార్యవర్గ సభ్యులుగా రామోజీ, వనజాక్షి, భానుంబి, లింగారెడ్డి, సుధాకర్ తిప్పేస్వామి, దూదే గోపాల్ వీరితోపాటు ఆహ్వానితులుగా మల్లికార్జున, రాజు, చిన్న ఓసికేరి, శర్మ ఎన్నికైనట్లు పార్టీ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, చెన్నా రాయుడు తెలిపారు.

మిథున్ రెడ్డి అరెస్ట్ రాజకీయ కక్ష సాధింపే ..

– ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

విశాలాంధ్ర-ఉరవకొండ: రాజకీయ కక్ష సాధింపులో భాగమే వైసీపీ నాయకులు ఎంపీ మిథన్ రెడ్డిని ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి ఆరోపించారు. ఆదివారం ఉరవకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏడాది పాలనలో సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం చేసిన ఒక్కటంటే ఒక్క మంచి పని లేదు అని విమర్శించారు. చంద్రబాబు పాలన గురించి ఎవరూ ప్రశ్నించకూడదనే లేని లిక్కర్ కేసును సృష్టించి వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్నది సుపరిపాలన కాదు, అరాచకపాలన అని అన్నారు. అధికారం ఉంది కదా అని లేని లిక్కర్ కేసును సృష్టించి, వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయించడం మంచి పద్ధతి కాదన్నారు. అధికారం శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తు పెట్టుకోవాలన్నారు.

గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : మండలంలోని ఉంతకల్లు గ్రామంలో జనసేన పార్టీ మండల నాయకుడు ముల్లా సికిందర్ భాష ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ.సి.జి., బి.పి., షుగర్, ఈ.సి.జీ, కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాయదుర్గం జనసేన పార్టీ ఇంచార్జ్, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మంజునాథ్ గౌడ్ హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనసేన నాయకుడు సికిందర్ భాష గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయ మన్నారు. ముస్ముందు ప్రతి గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఇలాంటి ఉచిత వైద్య సేవలు చేస్తామన్నారు. గ్రామీణ ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కిమ్స్ సవేరా ఆసుపత్రి వైద్య బృందం, టిడిపి యువ నాయకుడు మురళి, లేపాక్షి, ప్రేమ్, జనసేన మండల అధ్యక్షుడు శివరాజ్, జనసేన నాయకులు, శివరాం, ఖాదర్ బాషా, రాజేష్, సురేష్, నవీన్, సుపుత్ర, పాల్గొన్నారు.

దర్గాలో ఎమ్మెల్యే పూజలు

విశాలాంధ్ర-గుంతకల్లు: గుంతకల్ సయ్యద్ మస్తాన్ వలి స్వామి (పెద్ద దర్గా) 390 మహోత్సవానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గుంతకల్ మండల ఇన్చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దర్గా పెద్దలు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వారి సోదరులకు ప్రత్యేకంగా చదివింపులు చేశారు. దర్గా పెద్దల విన్నపం మేరకు వక్ఫ్ బోర్డు వారితో మాట్లాడి కనీస సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు గుణశేఖర్, మండల అధ్యక్షుడు రామన్న చౌదరి, టిడిపి సీనియర్ బండారు ఆనంద్, పట్టణ ఉపాధ్యక్షుడు ఫజుల్లా, పాల్గొన్నారు.

కంటి వైద్యునికి ఘనంగా వీడ్కోలు

విశాలాంధ్ర-యాడికి : తాడిపత్రి నియోజకవర్గం డివిజన్ పరిధిలో ప్రభుత్వ నేత్ర వైద్యాధికారిగా పదవీవిరమణ చేసిన గాదిరాజు మధుసూదన రాజును ఆదివారం మండల కేంద్రంలో కోన రోడ్డులోని జేఎం ఫంక్షన్ హాల్‌లో ఘనంగా సత్కరించారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన గాదిరాజు మధుసూదన రాజు మాట్లాడుతూ ఈ విధంగా రాయల సీమలో ప్రజా సేవలో ప్రశంసలందుకోవటం తన జన్మసార్థక మైంది అని అన్నారు. రాయలచెరువు లయన్స్ క్లబ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, ఉద్యోగులు ప్రశంసిస్తూ ఆయనను ఆయన సతీమణి డా.సునీత ఘనంగా సత్కరించారు. తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, రాయల చెరువు లయన్స్ క్లబ్ ప్రముఖులు రవి ప్రసాద్, కులశేఖర్, లక్ష్మీ నారాయణ, హెడ్ మాస్టర్ సర్వేశ్వర రెడ్డీ, నబీరసూల్, సిపిఐ సీనియర్ నాయకులు నీలూరు లక్ష్మయ్య వైద్యాధికారులు డా. పరమేశ్వర్ పాల్గొన్నారు.

అరవకూరులో మొహర్రం వేడుకలు

విశాలాంధ్ర -కూడేరు: మండలపరిధిలోని అరవకూరులో ఆదివారం మొహారం వేడుకలు ఘనంగా జరిగాయి.. గ్రామంలో పెద్ద పీర్లపండుగా చిన్న పీర్లపండుగా రెండు వేరువేరుగా అగ్ని గుండాలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం విడివిడిగా రెండు పండుగలు జరుగుతాయి.. కాకపోతే 23 సంవత్సరాలు తర్వాత రెండు పండుగలు కలిపి ఈ సంవత్సరం చేయడం తో ప్రతి ఇంటికి బంధువుల రాకతో సందడి వాతావరణం నెలకొంది. స్వాములు నాగుల దేవుడు కుళ్ళాయి స్వామి.కాసిం స్వామి, చిన్న లాల్ స్వామి, పెద్దలాల్ స్వామి, కదిరయ్య స్వామి, బొడ్డు స్వామి, కుడేరు స్వామి. ఊసేన్ స్వామి తదితర స్వామిలు ఉన్నాయి శనివారం రాత్రి పానకాలు.. ఆదివారం ఉదయం అగ్ని గుండంలో దిగడం.. సాయంత్రం పీర్లు జలధి వెళ్లాయి.

రక్తదాన శిబిరం ఏర్పాటు

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: బళ్ళారి నగరం కౌల్ బజార్ 25 వ వార్డిన రేడియో పార్క్ సమీపంలో కౌల్ బజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డా.నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం సిబ్బంది వర్గాల సహకారంతో స్వయం ప్రేరేపిత రక్తదాన శిబిర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బళ్ళారి మహానగర పాలక ఉపమేయర్ డి.సుకుమ్ రియాజ్ ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరం కార్యక్రమంలో పాల్గొన్నారు. రక్తదాన శిబిరంలో ఉప మేయర్ ఇంటివరాడ్ కాంగ్రెస్ యువ నాయకుడు రియాజ్ రక్తదానం చేయడం విశేషం, అంతే కాకుండా ఈ శిబిరంలో 246 రక్త దానవులు రక్తదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఉప మేయర్ ఆరోగ్య అధికారులు హెల్మెట్లను పంపిణీ చేశారు.

సీపీఐ పార్టీ బలోపేతానికి కృషి చేయండి..

విశాలాంధ్ర-తాడిపత్రి: సిపిఐ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తాడిపత్రి నియోజకవర్గ ఇంచార్జ్ రాజారెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం ఆర్ అండ్‌బి బంగ్లాలో సిపిఐ యాడికి మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ అధ్యక్షతన సిపిఐ తాడిపత్రి నియోజకవర్గ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిపిఐ కార్యవర్గ సభ్యుడు, సిపిఐ తాడిపత్రి నియోజకవర్గ ఇంచార్జ్ రాజారెడ్డి సిపిఐ సీనియర్ నాయకుడు పెద్దవడుగూరు సూర్యనారాయణ రెడ్డి తాడిపత్రి నియోజకవర్గ కార్యదర్శి టి.రంగయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్, పెద్దపప్పూరు మండల కార్యదర్శి చింతా పురుషోత్తం, తాడిపత్రి మండల కార్యదర్శి నాగరంగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాడిపత్రి నియోజకవర్గం ఇంచార్జ్ రాజారెడ్డి మాట్లాడుతూ సిపిఐ పార్టీ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నియోజకవర్గంలో అన్ని మండలాల మహాసభలు జయప్రదం చేయాలన్నారు. అలాగే ఆగస్టు 12, 13వ తారీఖున అనంతరం జిల్లాలో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో సిపిఐ పార్టీ సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లి, సిపిఐ పార్టీ జెండా ఆవిష్కరణలు సభలు జరిపి విజయవంతం చేయాలన్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో ఇంటి స్థలాలపై గతంలో పెద్ద ఎత్తున ఆందోళన చేశాం.. పేదలకు ఇంటి స్థలాలు దక్కేవరకు పోరాటాలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ పథకాలు అమలయ్యేలా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాడికి సిపిఐ మండల సహాయ కార్యదర్శి వద్దే రాముడు తాడిపత్రి మండల సహాయ కార్యదర్శి నారాయణరెడ్డి యాడికి మండల వృకాసం నాయకుడు బాలిరెడ్డి రాజారాం రెడ్డి, రామకృష్ణ, శ్రీరాములు, నాగేంద్ర, కే.నారాయణస్వామి పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం

-ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర-రాప్తాడు : టీడీపీ కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని, ఎమ్మెల్యే పరిటాల సునీత మీకు కొండంత అండగా ఉందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. రాప్తాడు టీడీపీ కార్యాలయంలో ఆదివారం నియోజక వర్గ స్థాయి టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎంపీ పార్థసారథి, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్, నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించిన కీలక నాయకులు, కన్వీనర్లు, క్లస్టర్ ఇన్చార్జులు హాజరయ్యారు. గత వైసీపీ హయాంలో టీడీపీ కార్యకర్తలు నాయకులపై నమోదు చేసిన అక్రమ కేసులు మాఫీ చేయడం,, 2014-19 మధ్య టిడిపి హయాంలో చేసిన పెండింగ్ పనుల బిల్స్ మంజూరు, నియోజకవర్గంలో అర్హులకు ఇంటిపట్టాలు, ఇళ్ల మంజూరు, ఇందిరమ్మ, జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణం లో జరిగిన అవినీతి అవకతవకల గురించి చర్చించారు. రేషన్ కార్డులు, భూముల రీ సర్వే వలన వస్తున్న సమస్యలు, నడిమి వంక రక్షణ గోడ నిర్మాణం, హంద్రీ నీవా ప్రాజెక్ట్ పనులు ప్రారంభం, భూములిచ్చిన రైతులకు పరిహారం, నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ ప్రైవేట్ భూములలో సోలార్, ఇతర పరిశ్రమలు ఏర్పాటు, చెన్నేకొత్తపల్లి, పులేటిపల్లి, నాగసముద్రం గ్రామాల మధ్యలో 4 వేల ఎకరాల బీడు భూములలో హార్టికల్చర్ హబ్ లేక సోలార్ హబ్ ఏర్పాటుపై మాట్లాడారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలు నాయకులే ప్రధాన బలమని.. వారి ఇబ్బందులను ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుర్తించారన్నారు.పార్టీలో ఉన్న ప్రతి నాయకుడు సుపరిపాలన కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకొని 100 శాతం పూర్తి చేయాలని సూచించారు.. ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ నియోజకవర్గంలో బలమైన టీడీపీ క్యాడర్ ఉందని... ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ గతంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి పథకాలు రానివ్వకుండా వైసిపి నాయకులు కుట్రలు చేశారన్నారు. రేషన్ కార్డులు, పింఛన్లు తొలగించారన్నారు. వీటన్నింటిపై మంత్రులు దృష్టికి తీసుకెళ్లామన్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత

విశాలాంధ్ర - జేఎన్‌టీయూఏ : మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, మదనపల్లె కళాశాలలోని ఎం.సి.ఏ విభాగం, మిట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెల్పింగ్ హాండ్స్ కార్యక్రమాన్ని మదనపల్లెలోని చైతన్య ఫౌండేషన్‌కు నిత్యావసర సరుకులను అందజేసినట్లు బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. కళాశాల ఎం.సి.ఏ మొదటి సంవత్సరం విద్యార్థులు 100 మంది లబ్ధిదారులకు రైస్ బ్యాగులు, నూనె ప్యాకెట్లు, నోట్‌బుక్స్, ఇతర అవసరమైన నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డా. ఆర్. మారుతముత్తు, డా.జూడ్ మోసెస్ అంటో దేవకాంత్, కె.కవిత కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ సమాజ అభ్యున్నతికి చేయూత అందించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో మరెన్నో కార్యక్రమాలను చేపట్టినందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

స్కూటర్‌ను ఢీకొన్న కారు.. భార్యాభర్తలు మృతి

విశాలాంధ్ర-శింగనమల : శింగనమల మరవ కొమ్మ 544డి హైవేలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మరవకొమ్మ క్రాస్‌లో బైకును కారు ఢీకొంది. శింగనమల మండలం గుమ్మేపల్లి గ్రామానికి చెందిన రఘునాథ్ రెడ్డి(45). సావిత్రి(43) దంపతులు తాడిపత్రి నుండి శింగనమల క్రాస్ మీదుగా ద్విచక్రవాహనంలో గుమ్మేపల్లి గ్రామానికి వెళ్తుండగా శింగనమల క్రాస్ వద్ద వాహనం శింగనమల వైపు తిరుగుతుండగా ఒక్కసారిగా తాడిపత్రి నుండి అనంతపురం వస్తున్న కారు స్కూటీని ఢీకొట్టడంతో భర్త రఘునాథరెడ్డి కాలు తెగిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య సావిత్రిని అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మరణించినట్లు సమాచారం. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శింగనమల పోలీసులు తెలిపారు.

ఇంకా ఎంత మంది ప్రాణాలు గాలిలో కలిసిపోవాలో? ... తాడిపత్రి నుండి శింగనమలకు రావాలంటే దారి లేకుండా డివైడర్లు వేశారు. అనంతపూర్ వెళ్లాలంటే రాంగ్ రూట్‌లో కిలోమీటర్ వెళ్లి ఎడమవైపు రోడ్లో తిరగాల్సి ఉంది. ఈ సందర్భంలో ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. హైవే అధికారులు గానీ, మండల స్థాయి అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు శింగనమల మండల ప్రజల యోగక్షేమాలు గాలికి వదిలేశారని స్థానికులు మండిపడుతున్నారు. శింగనమల నియోజకవర్గ కేంద్రానికి ఎటు వెళ్లాలో ఎటు రావాలో అర్థం కాకుండా ఉందని, అండర్‌పాస్ బ్రిడ్జిని నిర్మించాలని కోరుతున్నారు. లేకుంటే హైవేలో నాలుగు పక్కల స్పీడు బ్రేకర్లు ఏర్పాటు ప్రమాదాలు జరగకుండా దారి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆగస్టు 3న జిల్లా స్థాయి యోగాసనా పోటీలు..

విశాలాంధ్ర-అనంతపురం: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ అనంతపురం ఆధ్వర్యంలో 2025 జిల్లా స్థాయి యోగాసనా పోటీలు ఆగస్టు 3వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం వరకు ఉరవకొండలోని జిల్లా పరిషత్ హై స్కూల్ (సెంట్రల్ స్కూల్)లో నిర్వహించనున్నట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ అనంతపూర్ అధ్యక్షుడు ఎం రాజా శేఖర్ రెడ్డి తెలిపారు. స్థానిక వివేకానంద భవన్లో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ పోటీలలో 10 సంవత్సరముల నిండి 55 సంవత్సరముల లోపల ఉన్న వారందరూ పాల్గొనుటకు అర్హులన్నారు. కేంద్ర ప్రభుత్వం క్రీడలు యువజన మంత్రిత్వ శాఖచే గుర్తింపబడిన యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ సంస్థ ద్వారా రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారు ఖేలో ఇండియా, అస్మితా గేమ్స్, ఉమెన్ లీగ్ తదితర పోటల్లో పాల్గొనుటకు అర్హత సంపాదించుకోవచ్చు అన్నారు. జాతీయస్థాయిలో గెలుపొందిన వారు ఏషియన్ గేమ్స్ ఒలంపిక్ గేమ్స్ లో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ఈ అసోసియేషన్ ద్వారా నిర్వహింపబడిన రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీలలో విజేతలకు ఉద్యోగంలో స్పోర్ట్స్ కోట కింద రిజర్వేషన్ లభిస్తుందన్నారు. సబ్ జూనియర్, జూనియర్ సీనియర్ మరియు మాస్టర్స్ అను విభాగంలో పోటీలు ఉంటాయని, సిలబస్ రిజిస్ట్రేషన్ ఇతర వివరాలకు 99630 28694 ,99634 98250 94402 88899లలో సంప్రదించాలన్నారు. అనంతరం కరపత్రాలను వివేకానంద భవన్లో యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ అనంతపూర్ సభ్యులు దివాకర్, పుల్లయ్య, తారక్ రామయ్య, కృష్ణ, సుశీల, నాగ భూషణ, పరమేశ్వర్ రెడ్డి విడుదల చేశారు.

ప్రధాన రహదారి కల్వర్టు అస్తవ్యస్తం

విశాలాంధ్ర-అనంతపురం : పట్టణంలోని కోవురునగర్‌లో విశ్వభారతి స్కూల్‌కు పోవు ప్రధాన రహదారి కల్వర్టు అస్తవ్యస్తంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే ఈ దారిలో స్కూల్ పిల్లలు వారి తల్లిదండ్రులు వచ్చిపోతూ ఉంటారు. తల్లి తండ్రులు పిల్లలను మోటార్ బైక్‌ల మీద స్కూల్‌కు తీసుకు వెళ్లే సందర్భంలో కిందపడి ప్రమాదాలకు గురి అయ్యే అవకాశం ఉంది. ఈ పరిస్థితి ఏడాది కాలంగా తీవ్రంగా ఉన్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు తెలియజేశారు. మునిసిపల్ కిందిస్థాయి సిబ్బంది చూసిపోవడం తప్ప మరమ్మతులు చేయడం లేదు. పైగా మునిసి పాలిటీలో ఉన్నా విభాగాలు సిబ్బంది ఒకరిపై మరొకరు చెప్పుకొంటూ దాటవేస్తున్నారు. ఈ రోడ్డు ఇంత అధ్వానంగా ఉండటంతో నిత్యం డస్ట్ బిన్‌లు కలెక్ట్ చేసుకొనే పరిస్థితి కూడా లేదు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు, స్కూల్ పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆర్ట్స్ కళాశాల అభివృద్ధికి కృషి

అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

విశాలాంధ్ర-అనంతపురం: విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ వచ్చిన తర్వాత అనేక సంస్కరణలు తీసుకొచ్చారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం నూతన తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.... 50 ఏళ్ల నుంచి ఇది షెడ్డుగా ఉందని ఈ సమస్యను తమ దృష్టికి తీసుకొచ్చిన వెంటనే మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి చేశామన్నారు. ఆయన కళాశాల తరగతుల గదుల నిర్మాణానికి కోటి 29 లక్షలు, హాస్టల్ భవనాల కోసం రెండు కోట్ల 45 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు వివరించారు. 110ఏళ్ల చరిత్ర ఉన్న ఆర్ట్స్ కళాశాలకు ఆడిటోరియం లేదని తన దృష్టికి తీసుకొచ్చారని దీనిని కూడా మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ పద్మశ్రీ, అధ్యాపకులు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు వైద్య సిబ్బందిపై సూపరింటెండెంట్ సీరియస్..

విశాలాంధ్ర-అనంతపురం: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని ఆదివారం మధ్యాహ్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులతో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్న కొందరు వైద్య సిబ్బందిపై ఆయన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. విధులలో అలసత్వం వహిస్తున్న వైద్య సిబ్బందిపై మండిపడ్డారు. పీజీ వైద్య విద్యార్థులకు సూచిస్తూ రోగులకు సేవ చేసేందుకు వచ్చిన మీరు అది మరిచిపోయి వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్యాజువాలిటీ ఎఎంసి మార్చురీ వార్డ్, ఈసీజీ వార్డ్, సఖి సెంటర్, గైనిక్ వార్డులను ఆయన నిశితంగా పరిశీలించారు. సెక్యూరిటీ సిబ్బందిపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు మార్లు చెప్పినా పద్ధతిని మార్చుకోవడం లేదని మండిపడ్డారు. వైద్య సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యంగా ఉండరాదని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం తానే స్వయంగా స్ట్రెచ్చర్ ను కొంచెం దూరం వరకు తీసుకెళ్లారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ఈసీజీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ప్రస్తుతం అందుబాటులో లేని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

వైసీపీ విస్తృతస్థాయి సమావేశం

విశాలాంధ్ర-కణేకల్లు: కణేకల్‌లో ఆదివారం చిక్కణ్ణేశ్వర స్వామి కల్యాణ మండపంలో వైసీపీ మండల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథులుగా ఉరవకొండ వైఎస్ఆర్ పార్టీ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి మెట్టు గోవిందరెడ్డి హాజరయ్యారు. సర్పంచులు, ఎంపీటీసీ లు, రాష్ట్ర జిల్లా నియోజకవర్గం నుండి ఎన్నుకోబడిన వివిధ అనుబంధ విభాగల అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులతో కలిసి రికాలింగ్ చంద్రబాబు బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను మెట్టుగోవిందరెడ్డి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో సూపర్ సిక్స్ హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయడం లేదని.. వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డినీ గెలిపించి ముఖ్యమంత్రిగా చేసుకుంటే అందరికీ న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

- మరిన్ని గోకులాల నిర్మాణం
- రాష్ట్ర మంత్రి సవితమ్మ
- అభివృద్ధి పనుల పరిశీలన

విశాలాంధ్ర-రొద్దం: అభివృద్ధి సంక్షేమాన్ని రెండు కళ్ళుగా భావించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని మంత్రి సవిత తెలిపారు. దందేపల్లి క్రాస్ నుండి నెల్లూరుకు 1 కోటి 14 లక్షల రూపాయల నిధులతో పూర్తి చేసిన బీటీ రోడ్డు పనులను ఆదివారం పరిశీలించారు. నల్లూరు నుంచి కల్లుకుంట వెళ్లే పెన్నా నది పై 4 కోట్ల 40 లక్షల రూపాయలు నిధులతో జరుగుతున్న కాజ్ వే పనులను పరిశీలించారు. అనంతరం పెద్దగువ్వలపల్లి గ్రామము నుండి కల్లుకుంట క్రాస్ వరకు 75 లక్షల రూపాయల నిధులతో బీటీ రోడ్ పనులని పరిశీలించారు. డి యర్ కొట్టాల గ్రామంలో 1 కోటి 30 లక్షల రూపాయలు నిధులతో జరుగుతున్న బ్రిడ్జ్ పనులను స్థానిక నాయకులు అధికారులతో కలిసి పరిశీలించిన మంత్రి సవిత .సందర్భంగా గుత్తేదారులను త్వరిత గతిన నాణ్యతమైన పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు .మంత్రి సవితమ్మ మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటి నెరవేస్తున్నామని మంత్రి తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నరని, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలోనే అన్ని నెరవేరుస్తున్నామని తెలిపారు. ఎన్నికల హామీలో భాగంగా, ఇచ్చిన మాట ప్రకారం గానే 4,000 రూపాయలు పెన్షన్ కోడి కూయకముందే లబ్ధిదారులకు ఇస్తున్నామని ,ఇచ్చిన మాట ప్రకారం గానే సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇంటికి వచ్చి చేరుతున్నాయన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశ పెట్టామని, రొద్దం మండల వ్యాప్తంగా 44 గోకుల షెడ్లు నిర్మించామని, త్వరలో మరిన్ని గోకులాలు నిర్మిస్తామని మంత్రి సవిత తెలిపారు, ఎంజె పి స్కూల్ నిర్మాణానికి 20 కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చి పనులు జరుగుతున్నాయని, పేదవాడి ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్ పున: ప్రారంభించి 5 రూపాయలకే పేదవాడి కడుపు నింపుతున్నామన్నారు. అదేవిధంగా రైతులకు నాణ్యమైన కరెంటు అందించడం దొడగట్టలో సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తీ అయ్యిందని త్వరలోనే ప్రారంభిస్తున్నామన్నారు.

21 మంది బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-పెనుకొండ: నిస్సహాయ స్థితిలో ఉన్న అనారోగ్య బాధితుల ఆస్పత్రి ఖర్చులకు గాను ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్కులు మంజూర అవ్వగా మంత్రి సవితమ్మ చేతుల మీదుగా పెనుకొండ క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు, ఈ సందర్భంగా గోరంట్ల మండలం బూదిలి బోయ నాగరాజుకు 1,18,667 గుత్తి వారి పల్లి వినోద్ కుమార్ 59,041 బెల్లాల్ చెరువు గంగాద్రి కి 30,271పరిగి మండలం పాత్రిగానపల్లి నాగప్పకు 44,241 శ్రీరంగరాజుపల్లి మమతకు 12,459నేతలపల్లి కాంతమ్మకు 40,497 ఆనంద పాలెం జయ రామప్పకు 53,200పెనుకొండ కురుబ వాండ్లపల్లి. ఆదినారాయణకు 43,584 పెనుకొండ టౌన్ హనుమంతుకు 40,437 గుట్టూరు లింగమయ్యకు 2,77,174 మావుటూరు సుబ్బరత్నంకు 20,000 గుట్టూరు రమాదేవికి 80,700 రొద్దం చిన్నకోడిపల్లి తలారి రామప్పకు 16,670 కంబాలపల్లి లక్ష్మీదేవి కు 102,619 మోపర్లపల్లి వాజిద్‌కు 45000 రాచూరు అవిషకు 20,100చిన్నమంతుడు రామాంజనేయులు 70,813 రెడ్డిపల్లి భరత్‌కు 1,000 314, సోమందేపల్లి మండలం చెందిన బోయ ప్రణయ్ శ్రీ కు 54,186, యస్.వర్షాకు 91814 జి.మల్లికార్జున రూ.44,406ల చెక్కులను బాధితులకు మంత్రి సవితమ్మ అందజేశారు.

పేదల పక్షాన పోరాడేదే సీపీఐ పార్టీ

సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీరాములు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని మడకశిర రోడ్డులోని ఎంక్యూయూ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం నందు ఆదివారం సిపిఐ నియోజకవర్గ సమావేశం మరియు మండల కమిటీ ఎన్నిక మండల కమిటీ సమావేశం నియోజకవర్గ కార్యదర్శి శ్రీ రాముల నేతృత్వంలో నిర్వహించారు, మొదటగా సిపిఐ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించి సిపిఐ పార్టీ కోసం పోరాటం చేసి దిశా నిర్దేశం చేసిన పెద్దలకు నివాళులర్పించి అనంతరం సమావేశం నిర్వహించి సమావేశంలో సిపిఐ నాయకులు మాట్లాడుతూ సిపిఐ పార్టీ పేదల పక్షాన ఎన్నో పోరాటాలు చేసి ఎంతోమందికి కష్టాల నుంచి విముక్తి కలిగించిన పార్టీ అని కొనియాడారు నియోజకవర్గ వ్యాప్తంగా అనేక ఉద్యమాలు చేసి పార్టీ అభివృద్ధి కోసం ఎంతో మంది కష్టపడి పనిచేస్తారని పని చేస్తున్నారని తెలియజేశారు, పేదల పక్షాన ఇంటి పట్టాల కోసం, సాగు భూమి కోసం, ప్రభుత్వంతో వ్యతిరేకంగా పోరాటాలు కూడా చేస్తున్నామని, ఎంతోమంది కార్మికుల కర్షకుల కోసం కష్టపడి పనిచేసే పార్టీ జెండాను రెపరెపలా డించామని తెలిపారు, ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శులు సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

సిపిఐ నియోజకవర్గ, మండల కమిటీల ఎంపిక

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ లోని మడకశిర రోడ్డులో కల ఎం క్యూ యు చారిటబుల్ ట్రస్ట్ భవనం నందు ఆదివారం సిపిఐ సమావేశంలో నియోజకవర్గ కమిటీ, నూతన మండల కమిటీ ఎన్నుకున్నారు, నియోజకవర్గ కమిటీ అధ్యక్షునిగా శ్రీరాములు, ఇతర పాలకవర్గాన్ని ఎన్నుకొన్నారు, అలాగే మండల కార్యదర్శిగా నరసింహులు సహాయ కార్యదర్శిగా మల్లికార్జున, ఇతర పాలక వర్గాన్ని సిపిఐ నాయకులు హర్షధ్వానులతో ఎన్నుకున్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర-గోరంట్ల : భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహా సభలు సందర్భంగా ఎన్నిక అయిన జిల్లా కమిటీని నేడు భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ముద్దల వెంకటరమణప్ప అధ్యక్షతన పట్టణంలోని మాధవ రాయ దేవాలయం నందు అధికారికంగా ప్రకటించారు, ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులుగా మేస్త్రి బాబాజాన్, గోరంట్ల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొండా వెంకటేష్,జిల్లా ప్రధాన కార్యదర్శిగా సాంబ శివ, జిల్లా కోశాధికారిగా ముత్యాలప్పలతో పాటు 16 మంది సభ్యులను ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ భవన మరియు ఇతర నిర్మాణ రంగ కార్మికులను సంఘటితం చేసి, కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరణకై రాజీలేని పోరాటాలు చేస్తామని ఆశా భావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మొహమ్మద్, రఫీక్, నాగరాజు, కార్పెంటర్ ఫక్రోద్దిన్, నరసింహులు, వెంకటేష్ అబ్దుల్లాతో పాటు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత

మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్



విశాలాంధ్ర-ధర్మవరం : ధర్మవరం పట్టణంలో పరిశుభ్రత అందరి బాధ్యత అని, పట్టణంలోని అన్ని వార్డులలో గల కుటుంబ సభ్యులు పరిశుభ్రత పట్ల బాధ్యతగా వ్యవహరించినప్పుడే పట్టణ పరిశుభ్రత ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో ఉన్నందున, పట్టణ పరిశుభ్రతలో కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని.. ప్రతి వార్డులోనూ, షాపులు, తోపుడు బండ్లు, తాము చెత్తను ఒక ప్లాస్టిక్ డ్రమ్ములో వేసుకొని సిద్ధంగా ఉంచుకుంటే తదుపరి ట్రాక్టర్ల ద్వారా ఆ చెత్తను సేకరించడం జరుగుతుందని ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం వల్ల అపరి శుభ్రత ఏర్పడుతుందని తెలిపారు. ట్రాక్టర్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని వార్డులలో చెత్త సేకరణ కోసం వస్తుందని తెలిపారు. సమ్మెను నియంత్రించడానికి పారిశుద్ధ్య కార్మికుల నాయకులతో చర్చలు జరుపుతున్నామని, త్వరలో పరిష్కారం అవుతుందని తెలిపారు.

నేడు నియోజకవర్గ మహాసభలు..

సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణములోని ఎన్జీవో హెూం లో ఈనెల 21వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు సిపిఐ నియోజకవర్గ మహాసభలు నిర్వహిస్తున్నట్లు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ ఈ సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, చేతివృత్తిదారుల రాష్ట్ర అధ్యక్షులు జింక చలపతి ,ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు అని తెలిపారు.కనుక సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు, చేనేత కార్మిక సంఘం నాయకులు, విద్యార్థి,యువజన సంఘం నాయకులు,మహిళా సమాఖ్య లీడర్స్, అన్ని ప్రజా సంఘాల నాయకులు హాజరై నియోజకవర్గ మహాసభలను జయప్రదం చేయాలని తెలిపారు.

శిక్షణా తరగతులు విద్యాభివృద్ధి కోసమే

విశాలాంధ్ర-ధర్మవరం: శిక్షణ తరగతులు విద్య అభివృద్ధి కోసమే నిర్వహిస్తారని ప్రిన్సిపాల్ కరణ్ స్వరూప్ సింగ్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ పట్టణంలోని రుషి విద్యాలయ ఉపాధ్యాయ బృందం హైదరాబాదులో క్యాంబ్రిడ్జ్ యూనివర్సిటీ ఆంగ్ల విద్యా బోధన అవగాహన సదస్సుకు వెళ్లడం జరిగిందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ఇంగ్లీష్ మాట్లాడే సమర్థతను అంతర్జాతీయ బోధన నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. డాక్టర్ దివ్య అని కపూర్ వారి బృందం ఢిల్లీ నుండి హైదరాబాదుకు వచ్చి అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారన్నారు. అక్కడ తాము నేర్చుకున్న శిక్షణతో విద్యార్థులలో ఆంగ్లభాషలో పట్టు సాధించేలా తర్ఫీదు ఇస్తామన్నారు. కార్యక్రమంలో డీన్ భాస్కర్, సీఈవో రవీంద్ర, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి, ఏవో రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని కాపాడుకుందాం

విశాలాంధ్ర-ధర్మవరం : భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుట ప్రతి ఒక్కరి బాధ్యత అని రామదండు నిర్వాహకులు అన్నా లక్ష్మీనారాయణ, కల్లుమడి సుకుమార్, చౌటుపల్లి వినేష్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ప్రతి ఆదివారం రామదండు ఆధ్వర్యంలో శ్రీరామ నామ సంకీర్తనతో పాటు, హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని.. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులోని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్ పెనుజురు నాగరాజు నివాసంలో 32వ రామదండు కార్యక్రమం నిర్వహించామన్నారు. నేడు విదేశీ మోజులో పడి, భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు మరిచిపోతున్నారని, ఇలాంటి తరుణంలో మన భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలన్న లక్ష్యంతో రామదండు కార్యక్రమాన్ని గత 32 వారాలుగా ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా ఉదయం 8:30 నుంచి, 9:30 వరకు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతిఒక్కరూ మనసంస్కృతిని రాబోవు తరాలకు వారసత్వంగా అందజేసేందుకు కృషి చేయాలన్నారు.

సేవా భావాన్ని అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-ధర్మవరం : ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని సేవా నిర్వాహకుడు పామిశెట్టి నవ శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో దాదాపు 200 మందికి అల్పాహారాన్ని నవ శంకర్‌తో పాటు భార్య జయమ్మ దంపతులు పంపిణీ చేశారు. అనంతరం దంపతులు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తనకున్న దానిలో సేవ రూపంలో ఏదేని కార్యక్రమాలు నిర్వహించినప్పుడు మానవతా విలువలు పెరుగుతాయని తెలిపారు. మేము ప్రతి ఆదివారం మూడు సంవత్సరాలుగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ తిపేంద్ర నాయక్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తాయని తెలిపారు. నవ శంకర్ వ్యాపారం చేసుకుంటూ ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని తెలిపారు.

దహన సంస్కారాలకు చేయూత

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని రాంనగర్ ప్రాంతంలో నివాసముండే ముతుకూరు గణేష్ (వయసు 45) అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. గతంలో మగ్గంపై ఆధారపడి జీవనం సాగించిన గణేష్, నాలుగు సంవత్సరాల క్రితం షుగర్ వ్యాధి కారణంగా ఒక కాలును కోల్పోయారు. అప్పటి నుండి తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ, కుటుంబ అవసరాలను తీర్చలేని పరిస్థితికి చేరారు. గణేష్ కి మతిస్థిమితం లేని భార్య, పదవ తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు. ఈ దయనీయ పరిస్థితిని తెలుసుకున్న రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించారు. వారి సూచన మేరకు ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు, పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఓబిలేసు, కలిసి దహన సంస్కారాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. ఇంతకేకాకుండా, మృతుడి కుమారుని భవిష్యత్తు కోసం హరీష్ బాబు ఇంటర్మీడియట్ చదివించే బాధ్యతను స్వయంగా తీసుకున్నారు. అనంతర కార్యక్రమాల నిర్వహణకు ఆర్థిక సహాయాన్ని బీజేపీ నాయకుడు పోతుకుంట రాజు అందించారు. హరీష్ బాబు మాట్లాడుతూ ప్రజల బాధను మన బాధగా భావించే మానవీయత బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మంత్రి మార్గదర్శకంతో, ఇలాంటి కష్టకాలంలో సహాయంగా ఉండడమే మా ధర్మం అని తెలిపారు.

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

విశాలాంధ్ర బ్యూరో-శ్రీ సత్యసాయి : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ టి.ఎస్.చేతన్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్ లో పిజిఆర్ఎస్ నిర్వహణ, ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)ను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టి.ఎస్.చేతన్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్) వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని డివిజన్, మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు.

పార్టీ బలోపేతానికి.. కార్యకర్తలే పునాదిరాళ్లు..

హిందూపురం వైసీపీ సమన్వయకర్త దీపిక

విశాలాంధ్ర-లేపాక్షి : రాష్ట్రవ్యాప్తంగా అక్రమ కేసులు దౌర్జన్యాలు రెడ్ బుక్కు రాజకీయం రాజ్యమేలుతున్నదని కూటమి ప్రభుత్వ కుట్రలకు ఎవరూ భయపడవలసిన అవసరం లేదని భవిష్యత్తులో పార్టీకి కార్యకర్తలే పునాదిరాళ్లుగా నిలుస్తారని హిందూపురం వైసీపీ సమన్వయకర్త దీపిక రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మధుమతి రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం లేపాక్షిలోని చేతన కాంప్లెక్స్‌లో మండల కన్వీనర్ సయ్యద్ నిసార అహ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విస్తృత స్థాయి సమావేశంలో వారు పాల్గొన్నారు. బస్టాండ్ ఆవరణంలోనే వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టుకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ గడిచిన ఏడాదిలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదని బాబు మాటలు బూటకపు మాటలుగా నిలిచాయన్నారు. పురం అభివృద్ధిలో ముందుండాల్సిన ఎమ్మెల్యే బాలకృష్ణ చుట్టపు చూపుగా మిగిలిపోయాడన్నారు. లోకేష్ రాసిన రాజ్యాంగంలో రాష్ట్రం ముందుకెళ్తుందని ఈ అరాచక పాలనపై మండిపడ్డారు. ప్రజలు తిరుగుబాటు చేస్తారన్నారు. అనంతరం వైసీపీ నాయకుడు వేణు రెడ్డి మాట్లాడుతూ స్వార్థపరుల రాజకీయాలకు లేపాక్షి కార్యకర్తలు బలయ్యారన్నారు. మిథున్ రెడ్డిపై మోపిన అక్రమ కేసు కోర్టులో నిలబడదనే.. ప్రభుత్వం కక్ష సాధింపుగా ఆయన్ను అరెస్టు చేసిందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు బాలాజీ మనోహర్ నాగవేణి పురుషోత్తం రెడ్డి కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాజీ ఎంపీపీ హనూక్ వైస్ ఎంపీపీ అంజన్ రెడ్డి మల్లన్న చలపతి పాల్గొన్నారు.

డిజైనర్ జుజారు నాగరాజుకు సత్కారం

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని చేనేత డిజైన్‌లో సిద్ధహస్తుడైన డిజైనర్ జుజారు నాగరాజుకు జాతీయ అవార్డు వచ్చిన సందర్భంగా ఆదివారం పట్టణంలోని రాష్ట్ర చేనేత నాయకులు గిర్రాజు నగేష్ తమ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఈ అవార్డు ధర్మవరం వాసి పొందడం గొప్ప కీర్తి తేవడం జరిగిందన్నారు. నేడు ధర్మవరం పట్టుచీరలు జాతీయ స్థాయికి చేరడం నిజంగా గర్వించదగ్గ విషయమని కొనియాడారు.. చేనేత పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింతగా చేయూతనిచ్చి అభివృద్ధి దిశలో వెళ్లేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

క్రీడల్లో మంచి నైపుణ్యం పొందాలి

విశాలాంధ్ర-ధర్మవరం: క్రీడల్లో మంచి నైపుణ్యం పొందాలని బిజెపి నాయకుడు డోలా రాజారెడ్డి తెలిపారు. ఆదివారం వారు పట్టణంలోని ప్రభుత్వ బాలుర మైదానంలో జరుగుతున్న వీక్లీడ్ క్రికెట్ మ్యాచ్ కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అక్కడ జరుగుతున్న అనంతపురం అండ్ ధర్మారం క్రికెట్ జట్టుకు టాస్ వేసి ఇరువురు కెప్టెన్లకు శుభాకాంక్షలు తెలిపి క్రీడలను ప్రారంభించారు. తదుపరి వారు మాట్లాడుతూ మీకు క్రీడకు సంబంధించిన క్రికెట్ మ్యాచ్ ఇవ్వడం జరుగుతుందని వారు హామీ ఇచ్చారు. క్రీడలకు సంబంధించిన ఏ అవసరమైనా సరే నా దిష్టికి తీసుకొని వస్తే మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వారు తెలిపారు.

అక్రమ కేసులకు స్వస్తి పలకండి

విశాలాంధ్ర-కొత్తచెరువు: రాజకీయ కక్ష సాధింపులతోనే ఎంపీ మిధున్ రెడ్డి అరెస్టు చేశారని వైసీపీ మండల కన్వీనర్ శ్యాంసుందర్ రెడ్డి, తెలిపారు. కొత్త చెరువులోనే ధర్మవరం రోడ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులతోనే మద్యం కేసును సృష్టించి ఆయన్ని నిందితునిగా చేర్చారన్నారు. వారి కుటుంబం పైన ప్రభుత్వం వచ్చినప్పుడు నుండి వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు ఇలాంటి వాటికి స్వస్తి పలకాలన్నారు.మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రజలలోకి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియచెప్తున్నారు అన్నారు. వైసిపి పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం ఇప్పటికైనా ప్రభుత్వం మానుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వాల్మీకి శంకర్, వడ్డే నారాయణ, మాజీ సర్పంచ్ లోచర్ల రాజారెడ్డి, ఎంపీటీసీ రఫీ, మండల బీసీ సెల్ అధ్యక్షులు భాస్కర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు చెన్నరాయుడు, సయ్యద్ భాష, వెంకట రాముడు, సల్మాన్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకనే అక్రమ అరెస్టులు

విశాలాంధ్ర-అమరాపురం: జగన్మోహన్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేకనే కూటమి ప్రభుత్వం.. ఎలాంటి ఆధారాలు లేకున్నా రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని లిక్కర్స్ స్కాంలో అరెస్ట్ చేయడం తీవ్ర అన్యాయమని వైసీపీ బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హులుకూరు కాంతారాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రోజురోజుకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక కక్ష సాధింపు చర్యగా పరిపాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి అరెస్టులకు వైసీపీ నాయకులు ఎవరూ భయపడరని.. ఖచ్చితంగా న్యాయం గెలిచి మిథున్ రెడ్డి అతికొద్ది రోజుల్లోనే జైలు నుండి బయటికి వస్తారని పేర్కొన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో, వచ్చే శాసనసభ ఎన్నికల్లో వైసీపీని విజయ ఢంకా మోగించడానికి నాయకులు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రైల్వే కన్సల్టింగ్ బోర్డు మొదటి సమావేశం

విశాలాంధ్ర-ముదిగుబ్బ: రైల్వే కన్సల్టింగ్ బోర్డు మొదటి సమావేశం ముదిగుబ్బరైల్వే స్టేషన్ మాస్టర్ జాస్తి నాగభూషణ రైల్వే స్టేషన్ కన్సల్టింగ్ మెంబర్లు నిర్వహించారు. బోర్డ్ కన్సల్టింగ్ మెంబర్లు, బీజేపీ రాష్ట్ర అగ్రికల్చర్ రీసర్చ్ కో కన్వీనర్ సోమల ప్రకాష్ నాయుడు మాట్లాడుతూ, రైల్వే స్టేషన్‌లో రాత్రి సమయంలో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్న కారణంగా అల్పాహారం, వాటర్ బాటిల్లు,టీ, కాఫీ స్టాల్స్ ఏర్పాటు చేయాలని, వసతుల ఏర్పాటుకు ప్రతిపాదన చేయాలని, మదురై, ముంబై, అరుణాచలం రైళ్లు ఆపాలని చర్చించారు. అనంతరం స్టేషన్ మాస్టర్ నాగభూషణంకు రైల్వే బోర్డు మెంబర్లు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బోర్డ్ మెంబర్లు భాసి నేని వెంగనాయుడు, జిటి రాధాకృష్ణ, జయనంద రెడ్డి, రాము నాయక్,శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

బీఎస్కే చెస్ అకాడమీ ప్లేయర్ ప్రతిభ

విశాలాంధ్ర-ధర్మవరం: రాష్ట్రస్థాయి పోటీలో ధర్మవరం పట్టణానికి చెందిన బి.ఎస్.కె చెస్ అకాడమీ ప్లేయర్స్ చక్కటి ప్రతిభ కనపరిచారని ఇంటర్నేషనల్ చెస్ చీఫ్ కోచ్ అకాడమీ ఎస్.ఆదిరత్న కుమార్ తెలిపారు. ఈనెల 20వ తేదీన నంద్యాల జిల్లాలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ చెస్ అకాడమీ పోటీలు నిర్వహించారని, ఇందులో అండర్ -16 బాలుర కేటగిరిలో ఎస్. బి. కేదార్నాథ్ గుప్తా 2.5/3 నెగ్గి మొదటి స్థానం కైవసం చేసుకోవడం జరిగిందన్నారు. తదుపరి కోచ్ ఆదిరత్నకుమార్ కేదార్నాథ్ గుప్తాకు శుభాకాంక్షలు తెలియజేశారు.

హెూం శాఖ మంత్రి పర్యటనను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గుడిబండ: మడకశిర నియోజకవర్గంలో రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి టీడీపీ పార్టీ నాయకులకు కార్యకర్తలు ఆదివారం పిలుపునిచ్చారు. నేటి ఉదయం 11 గంటలకు గుడిబండలో జరుగు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో అనిత పాల్గొంటున్నారు. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, పాల్గొంటారని అలాగే రేపు సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ ఏర్పాటు చేశామని చెప్పారు.

ఓర్వలేకనే కక్షసాధింపు చర్యలు

విశాలాంధ్ర-గుడిబండ: వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ ఓర్వలేక, రాజకీయంగా ఎదుర్కోలేక, జగన్‌కు అత్యంత సన్నిహితులుగా మెలుగుతున్న కీలక నాయకులను కక్షపూరితంగా ఏదో ఒక విధంగా ఇబ్బందులు పాలు చేస్తున్నారని.. అందులో భాగంగానే జగన్‌కు అత్యంత ఆప్తుడు రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని లిక్కర్ స్కాంలో ఆధారాలు లేనప్పటికీ అరెస్ట్ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైకాపా మండల అధ్యక్షుడు డిఎల్ యంజార్ గౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మా నాయకులను ఎన్ని విధాలుగా ఇబ్బంది పెట్టాలని చూస్తున్న మా నాయకుడి పై ప్రజల్లో విశ్వాసం ఉంది కచ్చితంగా న్యాయం గెలుస్తుందిఅన్నారు. వైసీపీ కార్యకర్తలు ఎవరూ అధైర్య పడకుండా ఘర్షణలకు తావివ్వకుండా సంయమనం పాటించాలని కోరారు. రాబోవు రోజుల్లో ఈ కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని.. జగన్ మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రి చేసుకోవటానికి వైసీపీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

విశాలాంధ్ర-బుక్కపట్నం : మండల కేంద్రంలో ఆదివారం మొహరం వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. గత వారం రోజులుగా కోటవీధి, పేట వీధులలో పీర్ల చావిడి లలో పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయాన్నే పీర్లను గ్రామంలో ఊరేగించి అగ్నిగుండ ప్రవేశం కావించారు. సాయంత్రం కోట వీధి పేట వీధిలోని పేర్లు స్థానిక తెరు కూడలి వద్ద కలుసుకొని అలావు తొక్కుతూ, కేరింతలు మధ్య జలదికి తరలి వెళ్లాయి.

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు

విశాలాంధ్ర-గోరంట్ల :కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అధికారం అడ్డం పెట్టుకొని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రులు, ఎంపీలు, ప్రజాప్రతినిధులపై కక్ష సాధింపు చర్యలతో అక్రమ అరెస్టులు చేస్తున్నారని గోరంట్ల మండలం పుల్లేరు వైసీపీ యువ నాయకుడు సురేష్ రెడ్డి ఆరోపించారు, ఎంపీ మిథున్ రెడ్డిని అక్రమ లిక్కర్ కేసులో ఏ 4 ముద్దాయిగా చేర్చి అరెస్టు చేయడం అన్యాయం అన్నారు. దీనిని రాష్ట్రంలోని వైసీపీ నాయకులు, అభిమానులు తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిపై కాకుండా వైసిపి నాయకులే టార్గెట్ గా అక్రమ అరెస్టులు చేస్తూ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని ఇది ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. అక్రమ రెస్టులు ఆపాలని మిథున్ రెడ్డిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వైసీపీ పంచాయతీ అధ్యక్షుడు ప్రతాప్ సింగ్, ఉప సర్పంచ్ శ్రీనివాసులు, ఈ.వెంకటేష్, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ ..

విశాలాంధ్ర-ధర్మవరం: అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈనెల 20 న ప్రణవ్ అబాకస్ అకాడెమీ నిర్వహించిన రీజనల్ లెవెల్ అబాకస్ కాంపిటీషన్‌లో ధర్మవరం మిరాకిల్ ఎడ్యుకేషన్ సెంటర్‌కు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనిపరిచినారు అని మిరాకిల్ ఎడ్యుకేషన్ సెంటర్ డైరెక్టర్ శ్రీవాణి, ప్రాంచైజ్ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఈ కాంపిటీషన్‌లో గ్రీష్మ శ్రీ, ఆదిత్య సాయి ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్ సాధించారని తెలిపారు. జస్వంత్, పంవిత్ సౌర్యా, ఇషాన్ చాంపియన్ షిప్, మోనిత్, అవనీష్, మోక్షజ్ఞ, ధన్విత్, జైనందన్ టాపర్స్ నిలువగా, జస్వంత్, రతన్, హరి చందన, నాగ చరిత్, జగత్ కృష్ణా, పద్మజ్ విన్నర్‌గా నిలిచారన్నారు. దాదాపు 500 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారని చెప్పారు. విజేతలకు ఫిజికల్ డైరెక్టర్ జయ లక్ష్మి, మున్సిపల్ హై స్కూల్ హెడ్మాస్టర్ సుధాకర్‌రావు చేతుల మీదుగా ట్రోఫీలు అందుకోవడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 21, జులై 2025

ఘనంగా సచివాలయం ఉద్యోగులకు సన్మానం

విశాలాంధ్ర-గుంతకల్లు : కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సుపరిపాలనలో గ్రామంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం పథకాలు లబ్ధిదారులకు అందవేసే విషయంలో సచివాలయ ఉద్యోగులు ఎనలేని కృషి చేసినారు. ఈ మేరకు ఆదివారం సచివాలయ ఉద్యోగులు బదిలీలపై వెళ్తున్న సందర్భంగా వారు చేసిన సేవలు కొనియాడుతూ పూలమాల వేసి స్వీట్లు పంచి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ధోనిముక్కల గ్రామ సర్పంచ్ శ్రీరాములు, నరసింహులు, రాము, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

మహాప్రభో మాఊరికి రోడ్డు నిర్మించండి...

ఉల్లికల్లు గ్రామ ప్రజల ఆవేదన

విశాలాంధ్ర-శింగనమల : మండల పరిధిలోని ఉల్లికల్లు గ్రామానికి రోడ్డు గుంతలమయంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వర్షం పడితే చిన్న కుంటలను తలపిస్తున్నదని, ఎక్కడ ఏ గుంత ఎంత లోతు ఉందో తెలియక టూవీలర్లలో ఫోతూ పడి ఆసుపత్రుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా గ్రామానికి కొత్త బంధువులు రావల్లన్న తీవ్ర ఇబ్బందులు పడుతూ మెయిన్ రోడ్డు నుండి అట్లే వెనక్కివెళ్లి పోతున్నారని, రోడ్డు సక్రమంగా లేక ఊర్లోకి బస్సు కూడా రావడం లేదని చెబుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనం రావాలన్నా రాలేని పరిస్థితి దాపురించిందని, వర్షం వచ్చినప్పుడు గ్రామంలోకి వెళ్లలేకున్నామని, అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రతి ఇంటి సంక్షేమం కూటమి ప్రభుత్వం లక్ష్యం..

విశాలాంధ్ర-లేపాక్షి : గ్రామాలలోని పట్టణాలలోని ప్రతి ఇంటికి కూటమి ప్రభుత్వం అందజేసే సంక్షేమం అభివృద్ధి అందేంతవరకు నిరంతరం కృషి చేస్తామని టిడిపి మండల కన్వీనర్ అభిలాష్ తెలిపారు. ఆదివారం ఉదయం మండల పరిధిలోని కొండూరు పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గడపగడప తిరుగుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే వృద్ధులకు వికలాంగులకు ఎన్టీఆర్ పెన్షన్ అందజేయడం జరిగిందని ప్రతి విద్యార్థికి తల్లికి వందనం అందించామన్నారు. రోడ్డు మార్గం లేని గ్రామాలకు బీటీ రోడ్లతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అంతే కాకుండా భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు లేపాక్షి మండలంపై ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధార్థ శ్రీరామప్ప సిద్ధలింగప్ప వెంకటేష్ అశ్వత్ ప్రసాద్ తిరుమలేష్ మల్లికార్జున, నరసప్ప నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

నామకరణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

విశాలాంధ్ర-అమరాపురం: అమరాపురం మండలంలోని మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి మనమరాలు నామకరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి తనయుడు శివకుమార్ యాదవ్,ఎమ్మెల్సీ తిప్పేస్వామికి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమరాపురం మండల టీడీపీ కన్వీనర్ కృష్ణమూర్తి మాజీ మండల కన్వీనర్ ఎల్.శివరుద్రప, సింగల్ విండో అధ్యక్షులు గణేష్, అమరాపురం మండల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెన్నప్ప మరియు కేఎన్ఎం నరసింహమూర్తి కుటుంబ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా పి.ఎన్.మంజునాథ్

విశాలాంధ్ర-గుడిబండ : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీదేవి దేవాలయం ఆవరణ లో ఆదివారం మాదిగల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడిబండ మండల ఎంఆర్పీఎస్ అధ్యక్షుడిగా పి.ఎన్.మంజునాథను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ క్రమంలో గౌరవఅధ్యక్షులుగా ఎల్.కె. నరసింహప్ప, బిహెచ్ రాయుడు, ఎస్.ఆర్.నాగరాజ్, జడ్పిటిసి భూతరాజు, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, అలాగే గౌరవ సలహాదారులుగా కొంకల్లు శివన్న,వీఆర్ఏ నరసింహమూర్తి, ఈ.కుమార్, హనుమంత రాయుడులను ఎంపిక చేశారు. రాయుడు, ప్రధాన కార్యదర్శిగా మనోహర్, కార్యదర్శి రఘు, సహాయ కార్యదర్శిగా నరసింహారాజు, కోశాధికారిగా హనుమంతరాయ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు.

పత్తి పంటను పరిశీలించిన మంత్రి సవిత

విశాలాంధ్ర-రొద్దం : రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ ఆదివారం రొద్దం పెద్దమంతురు రొప్పాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి వివరిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి చర్యలు చేపట్టారు. నల్లూరు కల్లకుంట, పెద్దగులపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను పరిశీలించడానికి వెళ్తూ దండేపల్లి గ్రామ రైతుల పత్తి పంటలు పరిశీలి ంచి దిగుబడి బాగా వచ్చిందా వంటల పరిస్థితి ఎలా ఉంది లాభ నష్టాలు కష్టసుఖాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు ప్రజాప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

3600 అడుగుల జాతీయ పతాక ప్రదర్శన

విశాలాంధ్ర-పెనుకొండ : సేవ నైతికత దేశభక్తి భావనను ప్రోత్సహించే ఉద్దేశంతో, దొంతి లక్ష్మీనారాయణ గుప్తా సహకారంతో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో 3600 అడుగుల జాతీయ పతాక ప్రదర్శన ను,విజయవాడ ఒంగోలులో నిర్వహించనున్నారు. ఈ మహా కార్యక్రమంలో భాగంగా రొద్దం నుండి బయలుదేరిన సహారా రేడియోన్స్ సభ్యులకు ఆదివారం మంత్రి సవితమ్మ గౌరవప్రదంగా 3600 అడుగుల జాతీయ పతాకాన్ని తీసుకు వెళుతున్న వాహనానికి మంత్రి సవితమ్మ జెండా ఊపి ప్రారంభించి జాతీయ భావం తెలిపారు, మంత్రితో పాటు అనేకమంది కూటమి నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన మంత్రి

విశాలాంధ్ర-పెనుకొండ:

రొద్దం మండలం దొడగట్ట గ్రామానికి చెందిన ఉప్పర తిమ్మయ్య, ఉప్పర పాపమ్మ, వడ్డే అంజనమ్మ గత నెల రోజుల క్రితం దేవాలయముకు వెళ్లి పరిగి హైవే ధనాపురం క్రాస్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా వారి ఇంటికి వెళ్లి కుటుంబాలను మంత్రి పరామర్శించారు. అధైర్యపడకండి అండగా ఉంటామంటూ ఆర్థిక సహాయం అందజేశారు. రొద్దం మండల తెలుగుదేశం పార్టీ టౌన్ కన్వీనర్ చంద్రశేఖర్ నాయుడు గత 15 రోజుల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. వారి ఇంటికి వెళ్లి చిత్ర పటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల పరిధిలోని కోగిర గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు

ఎల్ఐసి అంజినప్ప అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటూ ఉండగా ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొని పరామర్శించారు.

బాబు పాలన అంతా మోసాల మయం

హామీలన్నీ బుట్టదాఖలు చేశారు.. టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం

విశాలాంధ్ర-పెనుకొండ : చంద్రబాబు మోసపూరిత మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నాగలూరు, మావటూరు గ్రామ పంచాయతీలల్లో సత్యసాయి జిల్లా వైసీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ ఆదేశాలనుసారం గ్రామస్థాయిలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరీ ఇంటింటికీ వెళ్లి, 2024 ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు ఇచ్చినటువంటి హామీలను గుర్తు చేస్తూ ప్రజలను వంచిస్తున్న తీరును వివరించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రూపొందించిన "బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ "క్యూఆర్ కోడ్‌ను ప్రతి ఒక్కరితోను స్కాన్ చేయించి, చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను మోసం చేస్తున్న తీరును ప్రతి ఒక్కరికీ వివరించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల వైసీపీ నాయకులు, నాగలూరు, మావటూరు గ్రామ పంచాయతీల వైయస్సార్సీపి నాయకులు, అభిమానులు మరియు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన మొహర్రం వేడుకలు..

విశాలాంధ్ర-గోరంట్ల: మండలంలోని గౌనివారి పల్లి, గుంటిపల్లి, పులేరు, బూధిలి, కమ్మవారి పల్లి,బూచేపల్లి తదితర గ్రామాల్లో ప్రతి ఏడాది ఆనవాయితీగా నిర్వహిస్తున్న మొహర్రం వేడుకలను భక్తి శ్రద్ధలతో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు, పది రోజుల క్రితం ప్రారంభమైన వేడుకలను ఆనందోత్సవాలతో ఉత్సాహంగా జరుపుకున్నారు, గ్రామాల్లో మొదటి రోజు ప్రత్యేక ప్రార్థనలు చేసి గుండాన్ని తవ్వి పీర్లను అలంకరించారు. మసీద్‌లలో ప్రత్యేకంగా అలంక రించిన పీర్లకు ఆయా గ్రామాల్లో భక్తులు పూలు, దట్టీలు సమర్పించారు. గ్రామంలో రాత్రివేళ మహిళల ఆటపాటలతో బొడ్డెమ్మలతో సంప్రదాయ నృత్యాలు చేశారు. హిందువులు, ముస్లింలు కలిసికట్టుగా పీర్ల ఎదుట దప్పుల చప్పుడులతో ఆడిపాడిన అలయ్ బలయ్ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది, తెల్లవారుజామున పీర్ల సవారీతో గ్రామ వీధుల్లోకి రాగా భక్తులు దారిపోడవునా

నీరుపోసి మొక్కులు తీర్చుకున్నారు, ప్రతి రోజు రాత్రి దప్పుచప్పులతో నృత్యాలు చేస్తూ, గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. ఆఖరు రోజు ఆదివారం ప్రత్యేక పూజలు చేసి షర్బత్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, మహిళలు, పిల్లలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రెడ్ బుక్‌లో భాగంగానే మిథున్ రెడ్డి అక్రమ అరెస్టు..

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి

విశాలాంధ్ర-ఉరవకొండ: వైసీపీ పార్టీ నాయకులు ఎంపీ మిథున్ రెడ్డిని రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగంగా రాజకీయ కక్ష సాధింపుతో అక్రమంగా అరెస్టు చేశారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి అన్నారు. ఆదివారం ఉరవకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్దిరెడ్డి కుటుంబాన్ని, వైఎస్సార్‌సీపీని ఇబ్బంది పెట్టడమే చంద్రబాబు ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందన్నారు.రాజకీయ దురుద్దేశంతో తప్పుడు విచారణలు, లేని లిక్కర్ స్కామ్‌ను సృష్టించి అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. అంతులేని దారుణ వేధింపులు ఇంకా కొనసాగితే ఏ మాత్రం సహించబోమని ప్రభుత్వ తీరును కచ్చితంగా ప్రజల్లో ఎండగడతామని తెలిపారు.

రాజకీయ కక్షతోనే మిథున్ రెడ్డి అరెస్టు

వైసీపీ వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర.

విశాలాంధ్ర-పెనుకొండ : కక్షపూరిత రాజకీయాలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, వైఎస్ఆర్సిపి వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర అన్నారు. ఆదివారం పెనుకొండ మండలంలో "బాబు షూరిటీ మోసం గ్యారంటీ" కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమీ ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి కక్షపూరిత రాజకీయాలను ప్రోత్సహిస్తుందన్నారు.ప్రజలకు ఇచ్చిన 143 హామీలను నిలబెట్టుకోలేక డైవర్షన్ రాజకీయాలు చేస్తూ వైఎస్ఆర్సిపి నాయకులే టార్గెట్‌గా చేసుకొని, లేని మద్యం కుంభకోణాన్ని తెరమీదకు తెచ్చి అక్రమంగా "ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు చేయడం బాధాకరం అన్నారు. ఇప్పటికే కూటమి నాయకుల దౌర్జన్యలతో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియా యాక్టివిస్టులు ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు అన్నారు. ఇప్పుడు ప్రజా ప్రతినిధుల సైతం అక్రమంగా అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, సర్పంచ్ సునందమ్మ, ఎంపీటీసీలు, రత్నమ్మ, శివయ్య, కన్వీనర్లు నరసింహులు, సుధాకర్ రెడ్డి, మాజీ కన్వీనర్లు నాగులూరు బాబు, శ్రీకాంత్ రెడ్డి ,పెనుకొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్, సునీల్, కౌన్సిలర్లు, శ్రీరాములు, గణప్ప, బోయబాబు,సద్దాం, యాసిన్,నాయకులు ప్రభాకర్ రెడ్డి, మల్లి రెడ్డి,పిట్టా బాబు, చెన్నకేశవులు,మరియు వైయస్సార్సీపి అనుబంధ విభాగాల అధ్యక్షులు,కమిటీ సభ్యులు, మండలంలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఆధారాలు లేకున్నా కుట్రలో భాగంగానే అరెస్టు..



విశాలాంధ్ర-రొళ్ల: వైసీపీ రాజంపేట పార్లమెంట్ సభ్యులు ఉమ్మడి అనంతపురం జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని లిక్కర్ స్కాంలో అక్రమంగా అరెస్టు చేశారని వైసీసీ మండల కన్వినర్ నరసింహారెడ్డి, జడ్పిటిసి అనంతరాజు మండిపడ్డారు. ఆదివారం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అభివృద్ధి చేయలేక ఇలా ఏదో ఒక విషయంలో ప్రజల్ని మభ్యపెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తూ కాలక్షేపాన్ని చేస్తుంది ఇప్పటికే ఈ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో అరాచకాలు, హత్యలు అరెస్టులుతో ముందుకు సాగుతోందని.. అందులో భాగంగానే నేడు మిథున్ రెడ్డిని లిక్కర్ స్కామ్ పేరుతో ఎటువంటి ఆధారాలు లేకపోయినప్పటికీ రాజకీయంగా ఎదుగుతున్నారన్న కుట్రతో కావాలని టిడిపి ప్రభుత్వం కక్ష్య గట్టి మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసిందన్నారు.

అధికారం శాశ్వతం కాదని, దీనిని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.మా నాయకుడిని అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని,దానికి రెండింతలు మీరు మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు.మీరు ఎన్ని అక్రమ కేసులు పెట్టిన రాజకీయంగా ఎంత ఇబ్బంది పెట్టిన తట్టుకొని మా నాయకుడు కడిగిన ముత్యంలా బయటికి తిరిగి వస్తాడని తెలియజేశారు వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా ఈ కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ గట్టిగానే బుద్ధి చెప్తారని తెలియజేశారు మిథున్ రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీలు,రాస్తారోకోలు సంఘీభావాలు తెలియజేస్తామని హెచ్చరించారు.

మిథున్ రెడ్డి అరెస్టు దారుణం..

విశాలాంధ్ర-గుంతకల్లు : వైసీపీ రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టు నియంతృత్వానికి పరాకాష్ట అని వైసీపీ యువజన విభాగం గుంతకల్ నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్ బాసిద్ అన్నారు. ఆదివారం స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద యువజన,విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసిపీ వైఎస్ఆర్సిపి యువజన విభాగం గుంతకల్ నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్ బాసిద్, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశి యాదవ్‌లు మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఎలాంటి ఆధారాలు లేనప్పటికీ కావాలనే కక్ష సాధింపు ధోరణితో నిన్నటి రోజున అక్రమంగా అరెస్టు చేయడం దారుణం అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినప్పటికీ రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేయకపోగా కేవలం ప్రశ్నిస్తున్నారనే, నేపంతో వైసీపీ నాయకుల పైన కార్యకర్తలపైన అక్రమ అరెస్టులు చేస్తూ దాడులు చేసూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి నారా లోకేష్ ప్రవేశపెట్టిన రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం జిల్లా కమిటీ సభ్యుడు సాయి సునీల్, విద్యార్థి విభాగం గుంతకల్ నియోజవర్గ అధ్యక్షుడు నక్క నాగప్ప, బీసీ సెల్ నియోజవర్గ అధ్యక్షులు రంగనాయకులు, ఎస్టీ సెల్ నియోజవర్గ అధ్యక్షుడు కొనకొండ్ల అంజి,ఐటి వింగ్ నియోజవర్గ అధ్యక్షుడు సూర్యరెడ్డి, వైసీపీ పట్టణ ఉపాధ్యక్షుడు శివ, కార్యదర్శి సూర్య పాల్గొన్నారు.

ఘనంగా పాండురంగ స్వామి దిండి ఉత్సవం

విశాలాంధ్ర-ఉరవకొండ: శ్రీ భావసార క్షత్రియ సమాజ్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉరవకొండలో కన్నుల పండువగా పాండురంగ స్వామి దిండి ఉత్సవాన్ని నిర్వహించారు. స్థానిక విట్టల్ రుక్మిణి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో స్వామివారిని భజనలు కీర్తనలతో ఊరేగించారు. ఈ సందర్భంగా విట్టల్ రుక్మిణి ఆలయంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ బావ సార క్షత్రియ సమాజం నిర్వహకులు గోపి వెంకటేశులు ఆశ్రమ నిర్వాహకులు ఎర్రి స్వామి, ఈశ్వర రావు, కౌశిక్ రావు, కిషోర్, రాము, సుధాకర్, అనిల్, శ్రీకాంత్, మోహన్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ నియోజకవర్గం లో 29 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ, 21.90 లక్షల రూపాయల సిఎం సహాయనిధి చెక్కులను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు ఆదివారం తన స్వగృహంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ, వైద్యానికి ఆర్థికస్తోమత లేని బాధితులు సాయం కోసం అర్థించగా, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సిఫార్సులతో ముఖ్యమంత్రి సహాయనిధి సాయం మంజూర అయిందన్నారు. ఈ కార్యక్రమంలో కూడేరు, విడపనకల్లు, బెలుగుప్ప మండలానికి చెందిన టిడిపి పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గేదె మృతి

రూ లక్ష నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన

విశాలాంధ్ర - అగళి : గత 20 రోజులుగా గేదే అనారోగ్యంతో పోరాడి మృత్యువాత పడ్డ సంఘటన మండలంలోని కర దాసనపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే కరదాసనపల్లి గ్రామంలో హనుమంతరాయప్ప అనే పాడి రైతుకు చెందిన గేదె అనారోగ్యంతో శనివారం మృత్యువాత పడినట్లు పాడి రైతు విలపించారు. మండలంలో పశువైద్యాధికారి లేకపోవడంతో ను ఇన్సూరెన్స్ సౌకర్యం లేకపోవడంతో తను తీవ్రంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు సంవత్సరాల నుంచి మండలంలో పశువైద్యాధికారి లేకపోవడంతో తనలాగా ఎంతోమంది పాడి రైతులు నష్టపోయారని తెలిపారు. వైద్యాధికారి అందుబాటులో ఉండి గేదెకు చికిత్సలు అందించి ఉంటే తాను నష్టపోయే వాడు కాదన్నారు. కనీసం ప్రభుత్వం ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి ఉంటే కూడా నష్టపోవడానికి వీలు ఉండేది కాదన్నారు. స్థానికంగా పశువైద్యాధికారుల అందుబాటు లేకపోవడంతో కర్ణాటక ప్రాంతం శిర పట్టణం నుంచి వైద్య అధికారులను పిలిపించి చికిత్సలు చేయించిన కూడా గేదెను కాపాడుకోలేకపోయానని తెలిపారు. చికిత్సల కోసం మరో 25 వేలు ఖర్చు చేసినట్లు రైతు వివరించారు. పాడి రైతుల పట్ల ప్రభుత్వం ఆలోచించి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మడకశిర అభివృద్ధిలో పాలుపంచుకుంటున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పాడి రైతుల పట్ల కూడా న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని రైతు రామాంజి కోరారు.

నేడు యాడికి మండల సర్వసభ్య సమావేశం..

.. ఎంపీడీవో వీర్రాజు

విశాలాంధ్ర-యాడికి: యాడికి మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం నేడు 11 గంటలకు యాడికి మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ భవనం నందు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వీర్రాజు తెలిపారు. ఈ సమావేశానికి గౌరవ సభ్యులు హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తమ అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో హాజరు కావాలన్నారు.